# స్వీట్ నాన్సెన్స్

ఆఫీసు నుంచి వచ్చి అరగంట దాటింది... అయినా బుజ్జిగాడు కనిపించలేదు...

బుజ్జిగాడికి నాదగ్గిర చనువెక్కువ... ఇద్దరు ఆడపిల్లల తర్వాత పుట్టాడేమో-వాడంటే నాకూ శ్యామలకూ కూడా పిచ్చిప్రేమ! నేను ఆఫీసుకు వెళ్ళేముందు నాకు "టాటా" చెప్తాడు... మళ్ళీ ఆఫీసునుంచి నేను తిరిగి రాగానే-నా దగ్గర చేరి-వచ్చీరాని మాటలతో-వాళ్ళమ్మ గురించీ, అక్కయ్యల గురించీ కంప్లయింట్ చేస్తాడు.

అలా ఫిర్యాదులు వాడినోట చెప్పించుకోవటం వాళ్ళకీ-వినటం నాకూ మహా సరదా!

ఆ రోజున నేనింటికి వచ్చి అరగంటదాటినా బుజ్జిగాడు కనిపించక పోయేసరికి మరి వుండలేక-అడిగేశాను శ్యామల్ని.

"అలకపాన్పెక్కాడు!"- చెప్పింది శ్యామల.

"అదేమిటోయ్? పెళ్ళిరోజున నేనెక్కాను... పెళ్ళయ్యాక నువ్ ఎక్కుతున్నావ్! ఇప్పుడు వీడు మొదలుపెట్టాడేమిటి?-"

"ఏం చేస్తాం?... మనిద్దరికీ పుట్టినవాడు కదా మరి! అందుకే వచ్చింది మాయదారి పోలిక" నవ్వేసింది శ్యామల,

"ఇంతకీ వాడి అలకకి కారణం ఏమిటో?" అడిగాను ఆతర్వాత శ్యామల అందించిన కాఫీ కప్పు అందుకుంటూ,

"ఇందాకా వీధిలో ఎవరో కుర్రాడు మూడు చక్రాల సైకిలు తొక్కుతూంటే చూశాడు... తనకీ అలాంటిది కావాలని పేచీ! చిరాకెత్తి రెండు అంటించాను."

శ్యామల మాటలు నన్ను కలవరపరిచాయి.

ఒక్కసారిగా నా జ్ఞాపకాలు గతంలోకి చొచ్చుకుపోయాయి...

ఆ గతంలో... అంటే ముప్పయ్యేళ్ళ క్రితం...

ఆరేళ్ళో ఏడేళ్ళో నాకప్పుడు!...

అయినా నాకు బాగా జ్ఞాపకం వుంది...

మా పక్కింట్లో వుండే పద్మనాభానికి వాళ్ళ నాన్న మూడుచక్రాల సైకిలు కొనితెచ్చారు - పద్మనాభం వాళ్ళ నాన్నగారు తాలూకాఫీసులో పనిచేసేవారు.

అలాంటి సైకిలు నాకూ కావాలని-ఆ రాత్రి భోజనాల దగ్గర 'ప్రోపోజల్' చేశాను. అమ్మ "సెకండ్" చేసింది.. కాని నాన్న నా ప్రొపోజల్ని కొట్టిపారేశాడు నిర్దాక్షిణ్యంగా... పుస్తకాలు ముఖ్యమన్నాడు. చదువు ముఖ్యమన్నాడు. జీవితానికి పరమార్థం మూడు చక్రాల సైకిలు తొక్కటం కాదన్నాడు... ఆపైన! అప్పట్లో రాబోయే ఏదో పండక్కి బట్టలు కుట్టించుకోవటం ముఖ్యమన్నాడు... అన్నింటినీ మించి తాను చెప్పినట్లు విని పడివుండటం మరింత ముఖ్యమన్నాడు...

కానీ ఆ మాట లేవీ నాకు రుచించలేదు... కోపం వచ్చి కంచంలోనే-తింటున్న అన్నాన్ని అలాగే వదిలేసి-చెయ్యి కడిగేసుకున్నాను. అన్నం తింటున్న చేత్తోనే-నాచెంప చెళ్ళుమనిపించాడు నాన్న...

"మానేస్తే మానెయ్ ! ఎవరికీ ఉద్ధరింపు ?" అన్నాడు... అమ్మ మాత్రం బాధపడింది... బ్రతిమాలింది...

"కావాలంటే పద్మనాభాన్ని అడిగి ఓసారి తొక్కుకుందువు గానిలే ? నేను చెప్తాను !..." అంటూ ఓదార్చింది...

కానీ నా కంటూ ఓ సైకిలు లేకపోయిన తర్వాత-ఎవర్నో అడిగి తొక్కుకుంటే అందులో ఎలాంటి థ్రిల్లూ వుండదని అనిపించింది... దాని సాయం అభిమానం కూడా అడ్డువచ్చింది.

"ఆఫ్ట్రాల్ ! ఇలాంటి చిన్నకోరిక తీర్చలేనప్పుడు అసలు పిల్లల్నెందుకు కనాలీ ?"- అనుకున్నాను...

అంతే... !

మూడు చక్రాలసైకిలు ఎక్కాలని ఉబలాటపడిపోయిన నేను. ఆ కోరికను బలవంతంగానే అణచుకున్నాను అప్పట్లో...

తర్వాత కొంతకాలానికే-వేసవి శలవల్లో ఓసారి మాఅమ్మమ్మ గారి వూరెళ్ళినప్పుడు-పెద్దసైకిలే నేర్చుకున్నాను మా మావయ్య దగ్గర. ఇప్పుడయితే స్కూటరుకూడా కొనుక్కున్నాను-అదంతా వేరే విషయం!

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే - సరిగ్గా నా చిన్నతనంలో నాకు కోరిక కలిగినట్లే-ఇప్పుడు బుజ్జిగాడికి కలిగింది... !

అప్పట్లో ఎలాంటి పరిస్థితులు అడ్డువచ్చాయో నాకు తెలియదు కానీ-నాన్న నాకు సైకిలు కొనిపెట్టలేకపోయాడు...

కాని ఇప్పుడు బుజ్జిగాడికి కొనివ్వగల స్తోమత నాకుంది...

"ఇలాంటి చిన్నకోరిక తీర్చలేనప్పుడు నన్నెందుకు కనాలసలు ?" అని రేపెప్పుడో వాడి చిన్నిమనసు చెన్నబుచ్చుకోకూడదు...

ఆ ఆలోచన రాగానే - అప్పటికప్పుడు జేబులో డబ్బు వేసుకుని బజారుకి బయల్దేరాను. మరో గంటకల్లా మూడుచక్రాల సైకిలుతో ఇంటికి తిరిగి వచ్చాను...

అప్పటికే శ్యామల బుజ్జిగాడికి చెప్పిందికాబోలు, వాడు గుమ్మంలో కూర్చుని ఎదురుచూస్తున్నాడు... దాన్ని చూడగానే వాడి కళ్ళల్లో కోటి దీపాల వెలుతురు మెరిసింది...

శ్యామల గబగబా వచ్చి హేండిల్‌బార్‌మీదా. సీటుమీదా పసుపు బొట్టు పెట్టింది.

బుజ్జిగాడ్ని సైకిలుమీద కూర్చోబెట్టి ఎలా తొక్కాలో చెప్పాను. వాడు ఏనుగెక్కినంత సంబరపడ్డాడు... "ట్రింగ్ ట్రింగ్" మని బెల్ మోగిస్తూ-హాలులో వాడు హుషారుగా సైకిలు తొక్కుతూంటే శ్యామల కూడా ఎంతో ముచ్చటపడింది...

సైకిలు చాలా అందంగా వుంది... హేండిల్‌బార్ వెండిలా మెరిసిపోతోంది... బుచ్చి బుచ్చి పెడల్సు... నీలంరంగు సీటు... ఆ సీటు వెనుక ముఖమల్ కుచ్చులు వేలాడుతున్నాయి...

ముప్ఫయ్యేళ్ళ క్రితం మరుగున పడిపోయిన కోరిక మళ్ళీ ఒక్కసారిగా దాన్నీ చూడగానే పురులు విప్పుకుంది...

"ఒకసారి ఇప్పుడు దాన్ని ఎక్కి తొక్కితే ఎలా వుంటుంది?..

'ట్రింగ్ ట్రింగ్' మని బెల్ మ్రోగిస్తూ-బుజ్జిగాడు తొక్కుతున్నట్లే-ఆ హాల్లో నేనుకూడా సైకిలు తొక్కితే బాగుండును!....

అలాంటి కోరిక కలిగినందుకు నాలో నాకే చచ్చేటంత సిగ్గేసింది.

ఇంత వయసొచ్చాక ఇప్పుడు దాన్నెక్కి అలా తొక్కితే పిల్లలు నవ్వు తారు.... శ్యామల ఆక్షేపిస్తుంది.... వాళ్ళందరి ముందూ నేను సిగ్గుపడ వలసి వస్తుంది....

చిన్నప్పుడైతే నాన్న కొనలేక పోవటంవల్ల ఆ కోరిక తీర్చుకో లేకపోయాను.... ఇప్పుడు బుజ్జిగాడికోసం ఎలాగూ కొన్నాను కనుక ఒక్కసారి మనసు తీర్చుకుంటే ఏం పోతుంది ?.... మనసు తీర్చు కోవటం కంటే మంచి అనుభూతి జీవితంలో మరేముంటుంది ?....

కానీ శ్యామలా. పిల్లలూ చూశారంటే నవ్వుతారు.... అందుకే ఎప్పుడో ఒకప్పుడు ఎవరూ చూడకుండా తొక్కాలి !—తప్పదు !....

గోడ దగ్గరున్న సైకిల్ని చూస్తూ, అలా ఆలోచిస్తూ పడుకున్న నాకు ఆ రాత్రి చాలాసేపు నిద్రపట్టలేదు.

అమర్నాడు సాయంత్రం మామూలుగా నేను ఆఫీసునుంచి తిరిగి వచ్చేసరికి బుజ్జిగాడు యమాస్పీడులో సైకిలు తొక్కుతూ కనిపించాడు.

"ప్రొద్దుట్నించీ తొక్కినవాడు తొక్కుతున్నట్టే వున్నాడు — మధ్యాహ్నం అన్నం నిద్రాకూడా మానేశాడు వెధవ !...." కంప్లయింట్ చేసింది శ్యామల....

నా కోరిక తీర్చుకునే అవకాశం దొరికేసరికి దాన్ని కాస్తా ఏ పార్టుకి ఆ పార్టు పీకిపాకాన పెట్టడు కదా అని క్షణంసేపు భయపడ్డాను.

"ఎలాగో అలా తొందర్లోనే మనసు తీర్చుకోవాలి !.... ఆ సైకిలు పాడయిపోకుండా ఒక్కసారి ఎక్కి ట్రింగ్ ట్రింగ్ మని బెల్ కొట్టుకుంటూ హాల్లో కనీసం మూడు రౌండ్లయినా కొట్టకపోతే రాత్రిళ్ళు నిదపట్టేలా లేదు !".... ఆ రాత్రి గట్టిగా తీర్మానించుకున్నాను....

మర్నాడు ఆదివారం....

"ఏమోయ్! చాలా రోజుల్నుంచీ మలకపేట, మీ చెల్లెలుగారింటికి వెడతానంటున్నావ్.... ఇవాళ వెళ్ళిరాకూడదూ?" మధ్యాహ్నం భోజనం చేస్తూ అన్నాను.

"మీరుకూడా రండీ వెడదాం!.... చాలా రోజులయింది మా లలిత మిమ్మల్ని చూసి"- అంది శ్యామల.

ఎలాగో అలా శామల్నీ పిల్లల్నీ మలకపేట పంపించేస్తే నేను సైకిలు తొక్కోవచ్చునని నా ప్లాను!.... ఇక నేనూ బయల్దేరితే కథేముంది?.... అందుకే చిన్న ఫిటింగా పెట్టేశాను.

"నాకూ రావాలనే వుందోయ్!....కానీ మా ఆఫీసులో పనిచేసే అప్పారావ్ వస్తానన్నాడు.... లేకపోతే వచ్చేద్దును!.... అందులోనూ నిన్నరాత్రి కలకూడా వచ్చింది" అన్నాను.

"కలా?.. ఏమని వచ్చింది?- ఆసక్తిగా అడిగింది.

"పాపం! లలిత బాత్‌రూంలో కాలుజారి పడిందట!.. మంచం దిగలేకపోతోందిట!.. వాళ్ళాయనే వండి వార్చి పెడుతున్నాడట!"- శ్యామలకి కలలమీద అపారమైన నమ్మకం వుంది! కారణం లేకుండా కలరాదని నమ్మే ఖచ్చితమైన మనిషి.

"అయితే మేం ఓసారి వెళ్ళి చూసొస్తాం!....మళ్ళీ అయిదయ్యేసరికి వచ్చేస్తాం! ఇల్లు మాత్రం జాగ్రత్తగా చూస్తుండండీ!"వంటింట్లో పని ముగించుకుని వచ్చాక శామల అంది.

"ఆ విషయం నాకు తెలియదా? ఈ హాల్లోనే పత్రిక చదువుకుంటూ కూర్చుంటాను!., ఖచ్చితంగా అయిదయ్యేసరికి వచ్చేయాలి!

అసలే నాకు తోచదుకూడాను !.. సమయానికి ఆ అప్పారావ్‌గాడు కూడా ఇప్పుడే రావాలా ?.. వారు వస్తానవకపోతే–నేనూ మీతో మలకపేట వచ్చేవాడ్ని హాయిగా"- అంతకు ముందు వేసిన అబద్ధపు పునాదిమీద గోడ కట్టాను.

అంతలోనే-మంచంమీద కూర్చున్న బుజ్జిగాడు క్రిందకు జంప్ చేసి-

"అమ్మా !.. నేను మలకపేట రాను !.. సైకిలు తొక్కుకుంటా నులే"-అన్నాడు పెద్దహీరోలా పోజు పెట్టి....

"ఔనండీ ! బుజ్జిగాడు వచ్చాడంటే మమ్మల్ని ప్రశాంతంగా మాట్లాడుకో నివ్వడు ! మీరుంటారుగా ఇంట్లోనే ! బుజ్జిగాడ్ని కూడా వుంచుకోండి"– అంది అతి మామూలు ధోరణిలో శ్యామల.

నా గుండెలు గుభేలుమన్నాయి. అయినా పైకి ఎలాంటి భావాన్ని చూపించకుండా అన్నాను.

"వద్దు శ్యామలా నామాటవిను ! ఆ అప్పారావ్‌గాడు క్షణం విరామం లేకుండా గుప్పుగుప్పుమని సిగరెట్లు కాలుస్తాడు.... మన బుజ్జిగాడు వాడ్ని చూశాడంటే రేపటినుంచి వాడూ మొదలెడతాడు..ఇలాంటి వయసులోనే పిల్లన్ని కట్టుదిట్టంగా పెంచాలి శ్యామలా !—

ఒక్కొక్కసారి నిజంకంటే అబద్ధమే గట్టిగా వుంటుంది. అందుకే శ్యామల మళ్ళీ బదులు చెప్పలేదు. మరో అరగంటకల్లా తయారై పిల్లల్ని తీసుకొని, శ్యామల మలకపేట వెళ్ళిపోయింది.

హాయిగా ఊపిరిపీల్చుకున్నాను. ఓసారి గోడగడియారం వైపు చూశాను. రెండున్నరయింది. అయిదయ్యేదాకా వాళ్ళు తిరిగిరారు.